క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం

జి.కొండూరు: మండల పరిధిలోని వెలగలేరు మారేడుతిప్ప దిగువన ఉన్న శ్రీ సత్తెమ్మతల్లి దేవాలయం నాల్గవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

బొర్రగూడెం(మైలవరం): మండలంలోని బొర్రగూడెంలో శ్రీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల దేవస్థానము హుండీలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వర ప్రసాద్, భక్తుల సమక్షంలో సోమవారం తెరచి లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.వి. సాంబశివరావు తెలిపారు. గత 208 రోజుల కాలానికి రూ.6,37,003 వచ్చాయని తెలిపారు. బంగారం, వెండి ఇతర వస్తువులు రాలేదన్నారు. దేవస్థానమునకు వచ్చిన భక్తులు సమర్పించిన తల నీలాలు పోగు చేసుకునే అనుమతికి ఒక ఏడాదికి రూ.2.18 లక్షలు హెచ్చుగా వేలంలో దక్కించుకున్న లబ్ధిదారు బొజ్జా ఏడుకొండలుకు (చౌటుప్పల్) అప్పగించినట్లు తెలిపారు.

ఏపీపీగా జేడీ గాంధీ

నూజివీడు: పట్టణంలోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జంగం దేవదాస్ గాంధీ (జేడీ గాంధీ)ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జేడీ గాంధీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ మేరకు డైరెక్ట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ పీపీగా జేడీ గాంధీ మూడేళ్లపాటు కొనసాగుతారు. 31 ఏళ్లుగా న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారు. గతంలో 2005 నుంచి 2012 వరకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా పని చేశారు. అడిషనల్ పీపీగా బాధ్యతలు చేపట్టిన జేడీ గాంధీకి సీనియర్, జూనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



ముసునూరు: వలంటీర్ల సేవలు అభినందనీయమని సీనియర్ వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ పేర్కొన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు అధ్యక్షతన సోమవారం ముసునూరులో గ్రామ వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ దంపతులు వలంటీర్లకు స్వీట్లు పంపిణీ చేసి, మహిళా వలంటీర్లు 17 మందికి చీరలు బహూకరించారు. నేతలు మాట్లాడుతూ మరింతగా సేవలు అందించాలన్నారు. పార్టీ నేతలు రవిప్రకాష్, చిన్నం రవి, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ముసునూరు: మండల తహసీల్దార్ జి.ఎస్.ఎస్. జవహర్ బాజి సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏ.ఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. డీటీ ఎమిలీ కుమారి, ఆర్.ఐ దీపిక, వీఆర్వోలు, రేషన్ డీలర్ల సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముసునూరు: ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను బీఎల్వోలు సిద్ధం చేయాలని తహసీల్దార్ బి.ఎస్.ఎస్. జవహర్ బాజి ఆదేశించారు. మండలంలోని చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ పద్మావతిదేవితోపాటు పరిశీలించారు. ఎస్‌ఐ పి.వాసు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఏఎల్ఎం కన్నా వీరాంజనేయులు కుటుంబానికి బీమా చెక్కును కెనరా బ్యాంక్ అధికారులు సోమవారం అందజేశారు. ఏపీసీపీడీసీఎల్ సంస్థలో పనిచేస్తున్న సమయంలో కెనరా బ్యాంక్‌లో లోన్ పొందాడు. ఆ సమయంలో బీమా చెల్లించడంతో హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ మంజూరు చేసిన రూ.11 లక్షలకు చెక్కును కేబీ సీనియర్ మేనేజర్ మహేష్, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు మృతుడి భార్య రాజేశ్వరికి అందజేశారు. విజయవాడ క్లస్టర్ మేనేజర్ ప్రసాద్, ఎల్‌వో కిరణ్‌పవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే ప్రభుత్వ పథకాలు

గోసవీడు(గంపలగూడెం): పేదల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలు సత్ఫలితాలిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని గోసవీడులో సోమవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తన స్వగ్రామమైన గోసవీడులో అన్ని వర్గాలూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకున్న కుటుంబాలు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. తిరువూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, సానికొమ్ము రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోటిరెడ్డి, సర్పంచి కందిమళ్ళ ప్రశాంత్, ఎంపీటీసీ సభ్యురాలు బి జయలక్ష్మి, ఉప సర్పంచి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



గోసవీడులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

- విద్యుత్ చౌర్యం పెద్ద నేరం
- నూజివీడు ఈఈ సత్యనారాయణ

రమణక్కపేట(ముసునూరు): విద్యుత్ చౌర్యం పెద్ద నేరమని, ప్రజలెవ్వరూ విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా ప్రభుత్వానికి సహకరించాలని ఆశాఖ నూజివీడు ఈఈ ఏ.సత్యనారాయణ సూచించారు. రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్ సర్వీసు మీటర్లు, బిల్లులను విస్తృతంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూజివీడు డివిజన్‌కు చెందిన ఏడీఈలు, ఏఈలు, ఎస్ఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లతో కూడిన 41 బృందాలు, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 2,165 గృహ, 303 వాణిజ్య సర్వీసులు తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో 100 సర్వీసులకు చెందిన వారు అక్రమంగా అదనపు లోడుతో విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరికి రూ.2,84,000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి సారి పట్టు బడితే జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యాన్ని గుర్తిస్తే 94931 74384, 94931 74285, 83310 14951 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఈ పోతురాజు, స్థానిక ఏఈ హేమసుందర కుమార్, ఎస్ఈ కేవీ సుబ్బారావు, డివిజన్లోని పలువురు ఏఈలు, ఎస్ఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాపూలే విగ్రహం ఏర్పాటుకు కృషి



మైలవరం: నియోజకవర్గ కేంద్రమైన మైలవరంలో మహాత్మాజ్యోతీరావు పూలే విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్. మారేష్ తెలిపారు. మైలవరం ఆర్ అండ్ బీ వసతి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మారేష్ మాట్లాడుతూ దేశం గర్వించ దగిన రీతిలో అందరివాడు జ్యోతీరావులే అని, ఆ మహనీయుని విగ్రహాన్ని మైలవరంలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు ఇ.జగదీష్, మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి డి.నాని తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్థలాల అప్పగింత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న కాలనీలో గుంటుపల్లి గ్రామం లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను ఎంపీపీ పాలడుగు జోత్స్న, పంచాయతీ అధికారులు సోమవారం అప్పగించారు. లబ్ధిదారులకు గతంలోనే పట్టాలు మంజూరు చేసినప్పటికీ స్థలాల్లో మెరక పనులు పూర్తికాకపోవడంతో ప్లాట్లు కేటాయింపులో జాప్యం జరిగింది. ఎంపీపీ పాలడుగు జోత్స్న, దుర్గాప్రసాద్ దంపతులు తమ సొంత ఖర్చులు భరించి లేఅవుట్‌లో మెరకపనులు పూర్తి చేశారు. లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకునే వెసులుబాటు కల్పించారు. స్థలాలు కటాయింపుతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు స్థలాలు అప్పగిస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న, తదితరులు

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



తిరువూరు: పట్టణంలో రక్షిత తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నందున నగర పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయించిన ట్రాక్టర్లు, తాగునీటి ట్యాంకర్లతో అన్ని వార్డులకూ నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కుళాయిల ద్వారా ప్రస్తుతం మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీరందిస్తుండగా, తాగునీటి ఇబ్బందులున్న వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక స్పందన ఆసుపత్రి వద్ద జరిగిన సంఘ సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా నర్సింగ్ వెంకటకృష్ణ, అధ్యక్ష ఉపాధ్యక్షులుగా మాయిరి వెంకటరమణ, నామా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా తీగల ఆంజనేయులు, కోశాధికారిగా యరనూక రవి, వర్కింగ్ ప్రెసిడెంటుగా షేక్ బాబు ఎన్నికయ్యారు. సంఘ జిల్లా నాయకులు ఆడెపు శ్రీనివాసాచారి, కాలసాని నాగేశ్వరరావు, కోమటి చెన్నారావు, పోతురాజు ఆంజనేయులు పర్యవేక్షించారు.



తిరువూరు మండల బీసీ సంక్షేమసంఘ కార్యవర్గం

శివాలయం పునర్నిర్మాణంపై గ్రామసభ

తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్లోని శ్రీరామలింగేశ్వరాలయం పునర్నిర్మాణ ప్రతిపాదనపై సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి వేణుబాబు అధ్యక్షత వహించారు. పురాతన ఆలయంలోకి వర్షాకాలంలో నీరు ప్రవేశించడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నందున పునర్నిర్మాణాన్ని దాతల సహకారంతో చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల అభిప్రాయాలను తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపడతామని వేణుబాబు తెలిపారు. పునర్నిర్మాణం జరిపేందుకు పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆలయ మేనేజరు వెంకటేశ్వరరావు, అర్చకులు రామమూర్తి, రాధాకృష్ణ, సీతారామలింగేశ్వరశర్మ, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.



గ్రామసభలో దేవదాయశాఖ అధికారులు, ప్రజలు

ముగ్గురు వ్యక్తులపై దాడి

ఇబ్రహీంపట్నం: తమ రేషన్ బియ్యం వ్యాపారాన్ని అడ్డుకుంటున్నారనే అనుమానంతో ఇద్దరు వ్యక్తులపైనా, అడ్డువచ్చిన మరో వ్యక్తిపైనా దాడిచేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రాజేష్, నాగబాబు, దేరంగుల గోపి, కిట్టు, కళ్యాణ్ పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తుంటారు. శ్రీకాంత్ రెడ్డి, చల్లా గోపి అనేవారు పోలీసులకు సమాచారం ఇచ్చి తమ వ్యాపారాన్ని అడ్డుకుంటున్నారనే అనుమానం వారికి ఉంది. పవిత్రసంగమం రోడ్డులో శ్రీకాంత్‌రెడ్డిపై తమ బియ్యం వ్యాపారం విషయంలో జోక్యం చేసుకోవద్దని గొడవపడ్డారు.ఖాజీమాన్యంకు చెందిన నాగబాబు, లారీ డ్రైవర్ చల్లా గోపికి ఫోన్ చేసి మీబాబాయి శ్రీకాంత్‌రెడ్డిపై పవిత్రసంగమం రోడ్డులో ఇతరులు గొడవ పడుతున్నారని చెప్పాడు. చల్లా గోపి అక్కడకు చేరుకునే సమయానికి అప్పటికే అక్కడున్న రాజేష్, నాగబాబు, దేరంగుల గోపి, కిట్టు, కళ్యాణ్ పీడీఎస్ బియ్యం విషయంలో వాదనకు దిగారు. శ్రీకాంత్‌రెడ్డి, చల్లా గోపిపై దాడిచేశారు. గొడవ ఆపేందుకు వెళ్లిన తమ్మిశెట్టి రాజేష్‌పై కూడా దాడికి పాల్పడ్డారు. గాయపడిన వారిని వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్‌ఐ అనూష రెండు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ సత్యనారాయణ తెలిపారు.

నేడు, రేపు ఎమ్మెల్యే పర్యటన

ఆగిరిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం, బుధవారం పర్యటిస్తారని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. పలు గ్రామాల్లో నిర్వహించినున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు గోపవరంలో వైద్యశిబిరం

ముసునూరు: మండంలంలోని గోపవరం సచివాలయం-2 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, నోడల్ అధికారి సీహెచ్.పద్మావతిదేవి, వైద్యాధికారి కరిముల్లా చెప్పారు. ఈ క్యాంపులో ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు అవినాష్, షకీనా ఇవాంజిలిన్, భవానితోపాటు మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. రెండో విడత నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు కొండపర్వలో ఎంపీ పర్యటన

విస్సన్నపేట: మండలంలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గం ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మంగళవారం ఉదయం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని కొండపర్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుబరోసా కేంద్రం , వెల్‌నెస్ సెంటర్ భవనాలను, 11 గంటలకు విస్సన్నపేటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల భవనం ప్రారంభిస్తారు. అనంతరం మార్కెట్ యార్డు గోదాము వద్ద నిర్వహించే ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

16న విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రముఖ ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీన విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం, రథసప్తమి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గోపాలకృష్ణ సుదర్శన హోమం, సూర్యనారాయణ మహామంత్ర హోమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనే వారు ముందుగా దేవస్థానం కార్యాలయంలో రూ.1116 చెల్లించి తమ పేరు గోత్రనామాలను నమోదు చేయించుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 95736 22446 నంబరులో సంప్రదించాలని సహాయ కమిషనర్ తెలిపారు.

ఘనంగా భక్త రామదాసు జయంతి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో సోమవారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో భక్త రామదాసు (కంచర్ల గోపన్న) జయంతి సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భద్రాచలంలో రామాలయం నిర్మాణం, దాశరథి శతకముతోపాటు మరెన్నో రామ సంకీర్తనలు రచించి, ఆనంద భైరవి రాగాల్ని తొలిసారి ఆలపించిన వాగ్గేయకారుడుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. గింజుపల్లి శంకరయ్య, ఊటుకూరు యజ్ఞకృష్ణ, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ మౌలానగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో మంగళవారం 2 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మౌలానగర్, వెంకయ్యనగర్, ఆంధ్రాహాస్పటల్ ఏరియా, సీఎం సెక్యూరిటీ ఆఫీస్ ఏరియా, ఐటీసీ కంపెనీ ఏరియా, ఎమ్‌కేఆర్ బిల్డింగ్ ఏరియా, వెంకటేశ్వర ఫౌండ్రీ ఏరియా, దర్గా, ఎస్సీ ఏరియా వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా ఉత్సవం

విస్సన్నపేట: స్థానిక మార్కెట్‌యార్డు గోదాము వద్ద 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ ఉత్సవం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.విజయకుమారి సోమవారం తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబు

తిరువూరు: స్థానిక తహసీల్దార్‌గా జే ప్రకాష్‌బాబు నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి ఆయన బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రేగళ్ళ మోహన్ రెడ్డి, దేవిశెట్టి బాలకృష్ణ, గజ్జల సీతారామారావు, యరదేశి రామారావు, గుమ్మా పాపారావు, నాయని కోటేశ్వరరావులు తహసీల్దార్‌ను కలిసి స్థానిక సమస్యలు వివరించారు.

తిరుపతిరావుకు ముస్లిం యువకుల సంఘీభావం

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావుకు ముస్లిం యువకులు సంఘీభావం తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం వచ్చిన తిరుపతిరావును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ విజయానికి కృషి చేద్దామన్నారు. గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీలు, బీసీలు పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు జోగి రాము, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తిరుపతిరావుకు సంఘీభావం తెలుపుతున్న ముస్లిం యువకులు

తిరుపతిరావుకు బాధ్యతలు అభినందనీయం

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా బీసీ నాయకుడు, జెడ్పీటీసీ సర్నాల తిరుపతిరావుకు ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కేటాయించడం హర్షణీయమని శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం గొల్లపూడి అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుక్కల గంగరాజు, తులిమెల్లి సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలలో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు అత్యధిక ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. ఏ పార్టీ అయితే యాదవులను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తుందో ఆ పార్టీనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులంతా బలపర్చాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న యాదవ సమాజానికి సంబందించిన అభ్యర్థులను తమ శక్తి వంచన లేకుండా గెలిపించుకునే ప్రయత్నం చేయాలని కార్యదర్శి నగుళ్ళ నాంచారయ్య పిలుపునిచ్చారు. వేరే వారి పల్లకీలు మోసే పరిస్థితుల నుంచి బయటికి రావాలని యాదవ సోదరులందరికీ విజ్ఞప్తి చేశారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమణి పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు మండలాల నుంచి 11 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వచ్చిన అర్జీలలో రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, డీఎల్‌పీవో సుందరి, డీఎల్‌డీవో వెంకటరత్నం తదితర డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గంపలగూడెం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం స్పందనలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధిక వర్షాల కారణంగా మండలంలో వరి, మిరప, పత్తి పైర్లను రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో తగిన సహాయక చర్యలను చేపట్టాలని కోరారు. రైతు, కౌలు రైతు సంఘాల ప్రతినిధులు వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, వీరారెడ్డి, నష్టపోయిన పలువురు రైతులు పాల్గొన్నారు.



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న ఏవో తేజోమణి

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

నూజివీడు: విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని నూజివీడు ఆర్టీసీ డీఎం సీహెచ్ సూర్యపవన్ కుమార్ పేర్కొన్నారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి డీఎం మాట్లాడుతూ వాహనాలను అతి వేగంతో నడపకూడదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని అన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని అన్నారు. ప్రమాదాలను తగ్గించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందన్నారు. వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీవీఎస్ సత్యన్నారాయణ, డ్రాయింగ్ టీచర్ ప్రియ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



తాము వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న నూజివీడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు